క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. సాయిరాం నగర్, కర్మన్‌ఘాట్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. సాయిరాం నగర్, ఆర్‌టీసీ, ప్రెస్ కాలనీ, గ్రీన్‌పార్క్, శ్రీనివాస్‌నగర్, శ్రీరామ్‌నగర్, కర్మన్‌ఘాట్, సుమంగళి గార్డెన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 23, బెండ 50, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 45, క్యాబేజి 9, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 18, దొండ 28–35, చిక్కుడు 45, గోకర 40, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 19, దోస 21, సొర 13, పొట్ల 18, ఉల్లి 18. చామగడ్డ 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ అజయ్‌నగర్ కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు సౌమిత్రి శ్రీధరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల పండ్లతో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమిత్రి శ్రీధరాచార్యులు మాట్లాడుతూ... శ్రీత్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో లోక కల్యాణార్థం అభయాంజనేయ స్వామి వారిని వివిధ రకాల పండ్లతో అలంకరించి పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సంస్థ సభ్యులు

అఫ్జల్‌గంజ్: రక్తదానం చేయడం ప్రాణదానంతో చేయడంతో సమానమని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. ఆదివారం వీ లవ్ యూ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఫౌండేషన్ సభ్యులు దాదాపు 136 మంది రక్తదానం చేశారు. డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. ప్రపంచ 508వ రక్తదాన శిబిరాన్ని ఉస్మానియాలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులను అభినందించారు.

ఆకట్టుకున్న 'చేజ్ టు విన్'



గోల్కొండ: విద్యార్థులకు చదువు, క్రీడలతో పాటు దేశభక్తిపై కూడా పాఠాలు బోధిస్తుండాలని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్ వీనస్ హైస్కూల్‌లో జరిగిన చేజ్ టూ విన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా విద్యా రంగంలో ఉంటూ ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించిన వీనస్ విద్యా సంస్థల డైరెక్టర్ హిదాయత్ అలీఖాన్‌ను ఆయన అభినందించారు. మెహిదీపట్నం, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో విద్యనభ్యసించడమే కాకుండా శిక్షణ పొందిన సైనా నెహ్వాల్, పీవీ సింధూ, నికత్ జరీన్ లాంటి వారు భారతదేశ కీర్తి ప్రతిష్ఠతలను దేశవ్యాప్తం చేశారని ఆయన అన్నారు. మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుకున్న ఎందరో అమ్మాయిలు నేడు మల్టీ నేషనల్ కంపెనీలతో పాటు దేశీయంగా పేరున్న కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంటీఆర్, ఎస్ఎంకే అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, ఐటా నగర అధ్యక్షుడు మహమూద అలీ సోహెల్, డీలక్స్, బృందావన్ కాలనీ, ఫాతిమానగర్ కాలనీ అధ్యక్షుడు కె.ఖ్యా. జునైద్, గయాసుద్దీన్, సయ్యద్ జియావుద్దీన్ తదితరులున్నారు.

నాగోలును మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్



చింతల అరుణ సురేందర్‌యాదవ్, నాగోలు కార్పొరేటర్

నాగోలు: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల్లోని సమస్యలను పరిష్కరించి అన్ని సదుపాయాలు కల్పించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఎంపీ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సహకారంతో డివిజన్‌కు గడచిన రెండు సంవత్సరాల్లో దాదాపు రూ. 18 కోట్ల నిధులను తీసుకొచ్చామన్నారు. ఆయా నిధులతో కాలనీలు, బస్తీల్లో మెరుగైన వసతులు కల్పించామని అరుణ సురేందర్ యాదవ్ స్పష్టం చేశారు. కార్పొరేటర్‌గా గెలిచి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు.. చేపట్టనున్న అభివృద్ధి తదితర అంశాల వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రశ్న: రెండేళ్ల మీ పాలనలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు.

జవాబు: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాను. కాలనీల్లో శానిటేషన్, డ్రైనేజీ సమస్య, మంచి నీటి సమస్య, సీసీ రోడ్లు, పార్కుల సుందరీకరణకు మొదటి ప్రాధాన్యతగా గుర్తించి డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేశాను.

ప్రశ్న: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేమిటి?

జవాబు: నాగోలు చెరువు వాకింగ్ ట్రాక్ అసంపూర్తిగా ఉంది. అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న నిధలు కేటాయించి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తాం. అక్కడే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి చెరువు కట్ట పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే చెరువును కొద్ది మేర అభివృద్ధి చేశాం. త్వరలోనే నాగోలు, బండ్లగూడ చెరువులను సుందీరకరించి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తాం.

ప్రశ్న: డివిజన్‌లో ప్రారంభమైన పెద్ద ప్రాజెక్టులు ఏమిటి?

జవాబు: రాజకీయాలకు అతీతంగా డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ సహకారంతో చిత్తశుద్ధితో కృషిచేస్తున్నాను. ఎమ్మెల్యే సకారంతో నాగోలు చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య లేకుండా నూతనంగా ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయింది. ఫతుల్లాగూడలో ముక్తిఘాట్ నిర్మాణాన్ని పూర్తిచేశాం. అనిమల్ కేర్ సెంటర్, అనిమల్ దహన వాటికను ఏర్పాటు చేశాము. ముంపు ప్రాంతాల సమస్య కోసం బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవతంగా పూర్తి అవుతున్నాయి. నాగోలు, బండ్లగూడ చెరువు సుందీరకరణ పనులు జరుగుతున్నాయి. అయ్యప్పనగర్, మల్లికార్జుననగర్ ముంపు సమస్య శాశ్వత పరిష్కారం త్వరలోనే లభిస్తుంది. నాగోలు చెరువులో కింద ఉన్న కాలనీ ముంపు సమస్యనూ త్వరలోనే పరిష్కారం చేస్తాం.

ప్రశ్న: ఎన్నికల్లో మీరిచ్చిన హామీలు నేరవేరాలంటే ఎంత మేర నిధులు అవసరం అవుతాయి?

జవాబు: జీహెచ్ఎంసీ ఎన్నికలో సమయంలో ఎన్నికల్లో సమమంలో ఇచ్చిన హామీలు పూర్తి కావాలంటే డివిజన్ ఎలాంటి సమస్యలు లేకుండా చేయాలంటే సుమారుగా రూ. 200 కోట్ల మేరు నిధులు కావాల్సి వస్తుంది. ఇప్పటి వరకు 80 శాతం కాలనీలకు అన్ని సదుపాయాలు కల్పించాం. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచినీటి సమస్య లేకుండా చేస్తాం. జీహెచ్ఎంసీ అధికారులతో, ఎమ్మెల్యేతో కలసి డివిజన్‌కు అధిక నిధులు తీసుకొచ్చి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు ముమ్మరం

నిర్విరామంగా శ్రమిస్తున్న కార్మికులు



మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు (ఇన్‌సెట్) కుంగిన రోడ్డు (ఫైల్)

చాదర్‌ఘాట్: రెండు రోజుల క్రితం చాదర్‌ఘాట్ ఇంపీరియల్ గార్డెన్ వద్ద నేషనల్ హైవేపై కుంగిన ప్రధాన రోడ్డు మరమ్మతు పనులు వేగవంతంగా చేస్తున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కార్మికులు పనులను కొనసాగిస్తున్నారు. డ్రైనేజీ నీటి ప్రవాహం పనులకు ఆటంకం కలిగిస్తున్నాయని జలమండలి అధికారులు తెలిపారు. ముందు కొంత భాగం కుంగింది అనుకున్న అధికారులకు తవ్వినకొద్దీ 1050 డయా సామర్థ్యం ఉన్న మురుగునీరు పైప్‌లైన్ మ్యాన్‌హోల్ దెబ్బతిన్నట్లుగా గుర్తించారు. జేసీబీ సహాయంతో మ్యాన్‌హోల్ ఇటుకలను తొలిగించారు. రాత్రి వరకు జేసీబీతో చేపట్టిన తవ్వకాలతో ట్రెంచ్‌లో మురుగునీరు వెలుపలికి రావడంతో పనులు ముందుకు సాగలేక పోయిందని అధికారులు తెలిపారు. యాకత్‌పురా నుంచి దిగువకు నూర్‌ఖాన్‌బజార్, తిరుమల టాకీస్ రోడ్డు, కేర్ దవాఖానాల రోడ్డు నుంచి 900ఎంఎం సామర్థ్యం గల డ్రైనేజీ పైప్‌లైన్‌ను దశాబ్దం క్రితం జలమండలి అధికారులు ఏర్పాటు చేశారు. మ్యాన్‌హోల్ మరమ్మతు పనులు నిర్మాణానికి మురుగునీటి పనులు ఆటంకం కలిగిస్తుండటంతో పైప్‌లైన్‌కు ఎంఎస్ షీట్ అమర్చి తద్వారా పనులు ముందుకు సాగించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మొత్తం మీద పనులు పూర్తి కావడానికి వారం రోజులు పడుతుందని అధికారులు తెలిపారు. పనులను జలమండలి, ఎస్‌టీపీ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రక్తదానంపై యువత చైతన్యం కావాలి



రక్తదానం చేసిన బాలకృష్ణ గురుస్వామి దంపతులు

సైదాబాద్: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్న ప్రాణాన్ని కాపాడి ప్రాణదాతులు అవుతారని అఖిల భారత గో సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి పేర్కొన్నారు. తలసేమియా బాధిత చిన్నారుల కోసం ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆనంద్‌మార్గ్ సేవాశ్రమం ఆచార్య సత్య దేవానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం కార్యక్రమంలో ఆయన ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత చైతన్యమై తమ ప్రత్యేక దినాల సందర్భాల్లో రక్తదానం చేయడం అలవాటుగా చేసుకోవాలని సూచించారు. మహిళలు కూడా రక్తదానం కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం ఆయన తన సతీమణి రాధికాగౌడ్, ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి రక్తదానం చేశారు. కార్యక్రమంలో గో సేవ ప్రతినిధులు శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్, నాగేశ్వరరావు, లోకేష్‌యాదవ్, సంతోష్, అమృత్, తాపేష్ దేవ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాకు 25 వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారని అన్నారు. వారిలో రాత్రి వరకు 1264 మందికి ప్రత్యక్షంగా, 6000 మందికి వాట్సాప్ ద్వారా నియామకపు పత్రాలు పంపించడం జరిగిందన్నారు. మరో పది రోజుల్లోగా మరో 6000 మందికి ఉద్యోగాలు రానున్నాయని అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి చెందిన 70 శాతం మందికి, ఇతర ప్రాంతాలకు చెందిన 30 శాతం మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగం రాలేదని ఎవరూ బెంగపడవద్దని, రాబోయే రోజుల్లో మిగతా వారికి కూడా ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పదవ తరగతి వారికి కూడా రూ. 10 వేల వేతనంతో కూడిన ఉద్యోగాలు వచ్చాయని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్, టీఏ అలవెన్సులు కల్పిస్తామని కంపెనీలు తెలిపాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరొక జాబ్ మేళాను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమానికి సహాయ, సహకారాలు అందించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, పలు విభాగాల చైర్మన్లు, సీనియర్ నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, ఉద్యమకారులు, కార్యకర్తలు, మహిళలు, వలంటీర్లు, వివిధ కంపెనీల మేనేజర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన సంక్షేమమే ఎన్‌టీఎఫ్ లక్ష్యం: ఉషాకిరణ్



ఎన్‌టీఎఫ్ విద్యార్థి విభాగ కమిటీ సభ్యులతో ఉషాకిరణ్

చంపాపేట: రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమమే నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) లక్ష్యమని రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు ఉషాకిరణ్ అన్నారు. ఆదివారం చంపాపేటలోని ఎన్‌టీఎఫ్ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రాష్ట్ర ఎన్‌టీఎఫ్ విద్యార్థి విభాగ కమిటీ అధ్యక్షుడిగా మేడా శ్రీను, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బుద్దా రూపేష్, ప్రధాన కార్యదర్శిగా కందుల నాగబాబు, ఉపాధ్యక్షులుగా సిద్ధార్థ నాయక్, చర్లపల్లి గణేష్, కార్యవర్గ సెక్రటరీగా దేవరాయ నాగరాజు, మహిళా విభాగ అధ్యక్షురాలుగా దేవర విజయలను ఎంపిక చేశారు. వారికి నియామక పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ పోడు జాతి రాష్ట్ర కన్వీనర్ నారాదత్తు, రాష్ట్ర కమిటీ సభ్యులు హాజరయ్యారు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

హస్తినాపురం: విద్యార్థులు అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్నీ వదలకుండా సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలని అక్షర స్కూల్ చైర్మన్ అర్కనపల్లి జగన్‌మోహన్‌రావు అన్నారు. హస్తినాపురంలోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశ అన్ని రంగాలలో రాణించేందుకు మంచి అవకాశంగా భావించి ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో మదన్‌మోహన్, ఈడీ సరితారావు, ఫైనాన్స్ ఈడీ రామారావు, ప్రిన్సిపాల్ రమణి వారణాసి తదితరులు పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అసాంఘికశక్తుల అడ్డాగా సైదాబాద్ కాలనీ పార్కు



సైదాబాద్: సైదాబాద్ కాలనీలోని మహాత్మా గాంధీ పార్కు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాత్రి వేళల్లో పలువురు యువకులు అక్కడికి గుంపులుగుంపులుగా చేరుకొని ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉదయం పూట చూస్తే పార్కు నలువైపులా ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయన్నారు. రాత్రి వేళల్లో గుమికూడిన వారిని వెళ్లమని కోరితే బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు కాలనీవాసులు తెలిపారు. కాలనీ మధ్యలో ఉన్న పార్కు నిర్వహణ సరిగా లేనందున పలు ఇబ్బందులకు గురవుతున్నామని వారు వివరించారు. సాయంత్రం, రాత్రి సమయాల్లో సైదాబాద్ పోలీసులు ఇక్కడ గస్తీ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఉదయ్‌నగర్ కాలనీవాసులు గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డిని కోరారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ ఆ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ స్తంబాలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. దశల వారీగా వీలైనంత త్వరగా వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు. నేతలు దనర్సింహారావు, సంజయ్, బాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సినీ స్టంట్ మాస్టర్లు రామ్, లక్ష్మణ్

దిల్‌సుఖ్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ స్టంట్ మాస్టర్‌లు రామ్, లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. ఆర్‌కేపురం డివిజన్ వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన పిరమిడ్ మెడిటేషన్ శాటిలైట్ హిందీ చానల్‌ను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... శతాబ్దాలుగా భారతదేశంలోని ప్రజల దైనందిన జీవితంలో మెడిటేషన్ ఓ భాగంగా ఉన్నదన్నారు. ఆధ్యాత్మికతతో ఒత్తిడి తగ్గుతుందని తద్వారా జీవన విధానంలో ఎన్నో మంచి మార్పులు చేకూరుతాయన్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి పిరమిడ్ మెడిటేషన్ చానల్ ఆవిర్భవించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ... అన్ని రాష్ట్రాల్లో ఈ చానల్ ప్రగతి పథంలో దూసుకు వెళ్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో చానల్‌ను ప్రారంభించామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దట్ల హనుమంత రాజు, మారం శివప్రసాద్, రాందాస్, దీప్తి, బాలకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హామీ ఏమైంది?

కాంగ్రెస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి



మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇంచార్జి

చైతన్యపురి: గత ఎన్నికల సమయంలో టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ ఏమైందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఒక్కో నిరుద్యోగికి రూ. 3116 నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయటంలేదని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రకటించారని గుర్తుచేశారు. కానీ ఏ ప్రయోజనాల కోసం అధికార పార్టీలో చేరారో స్పష్టం అయిందన్నారు. సోషల్ మీడియాలో హంగామా చేయటం తప్ప చేసిన అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వకుండా జాబ్ మేళాలు పెట్టి నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గ ప్రజలకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించాలో సుధీర్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్ ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఆయనకు తగిన గుణపాఠం చెప్పటం ఖాయం ఆయన స్పష్టం చేశారు.

పేదలను పట్టించుకోని ప్రభుత్వం: సామ రంగారెడ్డి



నేతాజీనగర్‌లో పాదయాత్ర చేస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందించే పెన్షన్, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, రేషన్ కార్డులు అందించే విషయంలో విఫలం అయిందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. కార్నర్ మీటింగ్‌లో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ నేతాజీనగర్ కాలనీ శక్తి కేంద్ర ఇంచార్జి శ్రీధర్‌రెడ్డి, లక్ష్మీదేవి, స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డితో కలసి ఆయన ర్యాలీ నిర్వహించారు. వివిధ అంశాలపై స్థానికులతో మాట్లాడారు. అనంతరం జరిగిన సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశ ఆర్థక వ్యవస్థ దృఢంగా తయారయిందన్నారు. పేదలకు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంతృత్వ పాలనలో పథకాల పేర్లు మార్చి ప్రజలను మభ్యపెడుతూ తెలంగాణను అప్పుల పాలు చేస్తుందని విమర్శించారు. పలువురు మహిళా నాయకులకు పార్టీ కండువా కప్పి బీజేపిలో చేర్చుకున్నారు. పార్టీ నేతలు రాంరెడ్డి, నీల ఆనంద్‌కుమార్, సత్యకుమార్, గడ్డం దయాకర్, డివిజన్ అధ్యక్షుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్య పరీక్షలు నిర్వహించుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలు, బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న వివిధ సంఘాల వారిని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అభినందించారు. ఆదర్శ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ కాలనీ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... అందరి ఆరోగ్యాలు బాగుండాలనే ఆలోచనలో సీనియర్ సిటిజన్స్ ఏర్పాటు చేసిన ఉచితంగా హెల్త్ క్యాంపును పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అపోలో హెల్త్ కేర్ సిబ్బంది ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, రాంరెడ్డి, అమృతరెడ్డి, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో మానసిక దృఢత్వం



టెస్ట్ పేపర్లు, ఓంఎంఆర్ సీట్లను విడుదల చేస్తున్న బీరప్ప, తదితరులు

మీర్‌పేట: పోటీ పరీక్షలు విద్యార్థుల్లో మానసిక దృఢత్వం పెంపొందిస్తాయని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప అన్నారు. అభ్యాస్ అకాడమీ, లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బాలాపూర్ చౌరస్తాలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో 9వ రాష్ట్ర స్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షకు సంబంధించిన టెస్ట్ పేపర్లు, ఓఎంఆర్ షీట్లను లార్డ్స్ స్కూల్స్ వైస్ చైర్మన్ నివాస్‌రెడ్డితో కలిసి చైర్మన్ బీరప్ప విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కలాం సైంటిఫిక్ టెస్ట్‌ను రాష్ట్రంలోని 7 కేంద్రాల్లో 3నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏకకాలంలో నిర్వహించామని తెలిపారు. అభ్యాస్ అకాడమీ సీఈఓ డా.ఫణిపవన్ మాట్లాడుతూ.. ఈ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 16వ తేదీన రవీంద్రభారతిలో ప్రముఖులచే పురస్కారాలను అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ రవికుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



మహేశ్వరం: అమీర్‌పేట్ పురాతన రామేశ్వర శివాలయంలో గణపతి, నంది, పార్వతీ, నాగదేవత, శిఖర విగ్రహాల ప్రతిష్ఠ, పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ప్రాతకాల పూజలు, శుభస్వాతి నక్షత్రంలో గణపతి, నంది, పార్వతీ, నాగ, ధ్వజ, శిఖర ప్రాణప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, మహాపూర్ణహుతి, అలంకరణం, నేత్రానిలయం, గోదర్శనం, దివ్యదర్శనం, హారతి, మంత్రపుష్పం, వేద ఆశీర్వచనం ఉదయం 10.05 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించగా.. సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. మహాపడి పూజ, జ్యోతిర్ముడి కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం చేశారు. వేడుకలకు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అమీర్‌పేట్ ఎంపీటీసీ కుమారి రాయప్ప, ఉప సర్పంచ్ నర్సింగ్, వేంకటేశ్వర ఆలయ చైర్మన్ ఆవుల రమేష్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, నాయకులు ప్రవీణ్, చంద్రమోహన్, గల్ల శ్రీకాంత్, శివాలయ కమిటీ అధ్యక్షుడు బస్వ రవీందర్ గౌడ్, గురుస్వాములు ప్రభాకర్, శేఖర్, ప్రసాద్, నరేష్, గ్రామ పెద్దలు, ఆలయ పూజారి ప్రేమ్ శర్మ పాల్గొన్నారు.